విద్యార్థికి ఆర్థికసాయం

పోచారం: ఆర్థికఇబ్బందులతో బాధపడుతున్న మెడికల్ విద్యార్థి గణేష్‌కు పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యనంపేట్ ప్రాంతానికి చెందిన సామాజికకార్యకర్త రంజిత్‌కుమార్ రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన గణేష్ పట్టుదలతో చదువుకుని ఎంబీబీఎస్ సీటు సాధించాడు.

ఎల్లంపేట్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా విఘ్నేశ్వర్‌రెడ్డి



మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా డబీల్‌పూర్‌కు చెందిన ఎర్రవల్లి విఘ్నేశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆయనను నియమించి మేడ్చల్‌లోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఉత్తర్వులు అందజేశారు. పార్టీ కార్యాలయంలో విఘ్నేశ్వర్ రెడ్డిని మున్సిపల్ నేతలు సన్మానించి అభినందించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

శామీర్‌పేట్: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మాజీ సర్పంచ్ వెంకటేష్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి నిరుపేదకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ఆ దిశగా పార్టీ కార్యకర్తలు నాయకులు కృషి చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు పేర్కొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డిలను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు తుంకి వెంకటేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, నాయకులు బాలనర్సింహ, బస్వారెడ్డి, జగన్నాథం, అఖిలేష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, వీరేశం, లక్ష్మణ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐ చిత్రపటానికి పాలాభిషేకం



జస్టిస్ గవాయి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

కీసర: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై దాడిని ఖండిస్తూ కీసర మండలం అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో మంగళవారం కీసర చౌరస్తాలో జస్టిస్ గవాయి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సుప్రీంకోర్టులోనే భారత ప్రధాన న్యాయమూర్తిపై దాడిచేసిన అడ్వకేట్ రాకేష్‌కిషోర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం సంయుక్త కార్యదర్శి కట్ట శంకరయ్య, ముత్యాలు, రాజలింగం, ఎల్లేష్, సత్యనారాయణ, మల్లేష్, శ్రీకాంత్, శ్రీనివాస్, రమేష్‌ముదిరాజ్, బాలకృష్ణ, రాజలింగం, వెంకట్, సాయిలు, బాలరాజు, నర్సింగ్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

మౌలాలి: మౌలాలి డివిజన్ ఈస్ట్ సుధానగర్‌లోని మహిగణపతిస్వామి ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం బీజేపీ సీనియర్ నాయకుడు గున్నాల శేఖర్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. సొసైటీ సభ్యులు శ్రీనివాస్, యాదగిరి, రమేష్, వేణు, సంజయ్, వెంకటేష్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మేడ్చల్: జాతీయ రహదారిపై చెక్‌పోస్టు వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మేడ్చల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌కు చెందిన కోమటి ఎల్లం (35) చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా.. గుర్తు తెలియని వాహనం అతడిని ఢీ కొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫిట్స్ వచ్చి గుర్తు తెలియని మహిళ మృతి

కుషాయిగూడ: ఫిట్స్‌తో ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 40–45 ఏళ్లున్న మహిళ సైనిక్‌పురి ఫస్ట్ ఎవెన్యూ వద్ద ఫిట్స్ వచ్చి కిందపడిపోయింది. నోటి నుంచి నురగలు వస్తున్న ఆమెను గుర్తించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే మృతి చెందింది. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దీంతో పోలీసులు గుర్తు తెలియని మహిళ మృతిగా కేసు నమోదు చేశారు. వివరాలకు 87126 62194, 87126 62119, 87126 62116.

ఉన్నట్లా.. లేనట్లా..?

మినీ స్టేడియం నిర్మాణంపై అమలుకు నోచుకోని హామీలు • ఆటలకు దూరమవుతున్న క్రీడాకారులు

జవహర్‌నగర్: క్రీడలపై ఆసక్తి ఉన్నా క్రీడామైదానం లేక ఔత్సాహిక క్రీడాకారులు తమ ప్రతిభకు పదును పెట్టలేకపోతున్నారు. జవహర్‌నగర్‌లో మినీ స్టేడియం ఏర్పాటు ప్రజాప్రతినిధుల హామీలకే పరిమితమైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



తెలంగాణ క్రీడా మైదానాన్ని ప్రారంభించిన మేయర్ (ఫైల్)

కలగానే స్టేడియం నిర్మాణం..

జవహర్‌నగర్‌లో మినీ స్టేడియం కలగానే మిగిలిపోతోంది. ఇక్కడి విద్యార్థులు, జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తున్నా.. సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మినీస్టేడియం ఏర్పాటుతో పాటు యువ క్రీడాకారులకు తగిన వసతులు సౌకర్యాలు కల్పించడంలో అటు ప్రభుత్వం ఇటు అధికారులు ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని క్రీడాభిమానులు ఆరోపిస్తున్నారు.

అమలుకు నోచుకోని హామీలు..

జవహర్‌నగర్‌లో మినీ స్టేడియం ఏర్పాటుకు పాలకులు ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారు. జవహర్‌నగర్‌లో 2 జిల్లా పరిషత్, 8 ప్రైమరీ పాఠశాలలు ఉండగా.. దాదాపు 30కి పైగా ప్రైవేటు స్కూల్స్ ఉన్నాయి. జవహర్‌నగర్‌లోని క్రీడాకారులు అరకొర వసతులున్నా.. జాతీయ, రాష్ట్రస్థాయికి ఎంతో మంది విద్యార్థులు ఎంపికై విజయాలు సాధించి బహుమతులు సాధించారు. క్రీడాపోటీల ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొన్న అతిథులు, నాయకులు, అధికారులు జవహర్‌నగర్‌లో మినీస్టేడియం ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తున్నా.. ఆచరణలో మాత్రం ' ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ' అనే చందంగా మారింది.

మరెన్నో పతకాలు సాధించే అవకాశం..

మినీ స్టేడియం ఏర్పాటు చేస్తే క్రికెట్‌తో పాటు వాలీబాల్, కరాటే, అథ్లెటిక్స్ కబడ్డీ, ఖోఖో, టెన్నిస్ తదితర క్రీడాపోటీల్లో మరింత రాణించే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు జవహర్‌నగర్‌లో మినీస్టేడియం ఏర్పాటుపై శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

సుమారు 3 లక్షల జనాభా..

జవహర్‌నగర్ పట్టణంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని గతంలో అనేకసార్లు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు అధికారులను, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయింది. జవహర్‌నగర్‌లో దాదాపు 3 లక్షల జనాభా ఉందని, వీరిలో లక్షకు పైగా యువకులే ఉన్నారు. గత కొద్దిరోజుల క్రితం మేయర్ కావ్య సమక్షంలో హడావిడిగా జవహర్‌నగర్‌లోని సర్వే నెంబరు 704, 706లలో ఐదెకరాల స్థలంలో రెండేళ్ల క్రితం జూన్ 2న హడావిడిగా మినీ స్టేడియాన్ని ప్రారంభించినా ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టలేదు. దీంతో తెలంగాణ ప్రభుత్వ క్రీడా మైదానం పేరుతో పెట్టిన బోర్డును సైతం తొలగించారు.



క్రీడా మైదానాన్ని ప్రారంభించి వాలీబాల్ ఆడుతూ..

భూములు పరిరక్షణలో అధికారులు విఫలం

ప్రభుత్వం ప్రజా అవసరాల నిమిత్తం మున్సిపాలిటీకి కేటాయించిన స్థలాలను కాపాడుకోవడంలో అధికారులు పూర్తిస్థాయిలో విఫలమవుతున్నారు. గ్రామపంచాయతీ నుంచి మున్సిపల్ ఆపై కార్పొరేషన్‌గా అవతరించిన అనంతరం రెవెన్యూ అధికారులు ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన ఏ ఒక్క స్థలాన్ని స్వాధీనం చేసుకుని అభివృద్ధి పనులు ప్రారంభించిన దాఖలాలు కనిపించడంలేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆటస్థలం లేక ఇబ్బందులు..



పేద క్రీడాకారులు సరైన వసతులు లేకపోవడంతో తమ ప్రతిభను కనబరచలేకపోతున్నారు. గతంలో చాలామంది రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారులు ఉన్నారు. ఇప్పటికైనా యువక్రీడాకారులను దృష్టిలో ఉంచుకుని చేయూతనివ్వాలి.

– రాజశేఖర్, ఫిజికల్ డైరెక్టర్, సీఆర్‌పీఎఫ్ స్కూల్

స్టేడియంతో పాటు కోచ్‌ను నియమించాలి



3 లక్షల జనాభా నివసించే జవహర్‌నగర్‌లో మినీస్టేడియం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అథ్లెటిక్స్‌లో ఎంతో మంది యువకులు విద్యార్థులు రాణించే అవకాశం ఉంది. మినీస్టేడియం ఏర్పాటు చేస్తే జాతీయ స్థాయి క్రీడా కారులుగా ఎదిగేందుకు దోహదపడుతుంది.

– నరేందర్,
తైక్వాండో యూనియన్ ప్రధాన కార్యదర్శి

కేటాయించిన అన్ని స్థలాలను కాపాడుతాం



జవహర్‌నగర్‌లో ప్రజా అవసరాల కోసం కేటాయించిన ప్రతీ స్థలాన్ని కాపాడుతాం. ఇప్పటికే కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కలెక్టర్‌తో మాట్లాడి మరిన్ని నిధులు తీసుకొచ్చి కేటాయించిన స్థలాలన్నింటికీ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాం. కొన్ని స్థలాల్లో కోర్టు వివాదాలు ఉన్నాయి. వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

– వసంత,
కమిషనర్ జవహర్‌నగర్ కార్పొరేషన్

కొమరంభీమ్‌కు ఘన నివాళి

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధ్వర్యంలో మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో కొమరంభీమ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పద్మజ, ఎస్సీ అభివృద్ధిశాఖ జిల్లా అధికారి వినోద్ కుమార్, జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి ఝాన్సీరాణి, కలెక్టరేట్ విభాగంలోని వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. కోమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హైవేపై ధర్నా..

30 మందిపై కేసు నమోదు

ఘట్‌కేసర్: అనుమతి లేకుండా వరంగల్ జాతీయ రహదారిపై ధర్నా చేసిన 30 మందిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. అవుషాపూర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ అమీర్ (34) మృతికి నిరసనగా ఈనెల 6న సాయంత్రం వరంగల్–హైదరాబాద్ జాతీయరహదారిపై స్థానికులు ఎలాంటి అనుమతి తీసుకోకుండా ధర్నా చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ధర్నా నిర్వహించడంతో వాహనదారులకు ఇబ్బంది కలిగింది. పోలీసుల విధులకు ఆటంకం కలగడంతో 30 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్ సిబ్బందిపై దాడి..

నిందితులపై కేసు నమోదు

ఘట్‌కేసర్: మద్యం మత్తులో కొందరు వ్యక్తులు హోటల్ సిబ్బందిపై దాడి చేసిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. అవుషాపూర్‌లోని యాదాద్రి హోటల్లోకి అదే ప్రాంతానికి చెందిన కొట్టి శ్రీకర్‌రెడ్డి అలియాస్ టింకు, మణిదీప్‌రెడ్డి అలియాస్ సన్నిలతో పాటు మరో ఆరుగురు సోమవారం రాత్రి మద్యం మత్తులో సిబ్బందిపై దాడి చేశారు. ఫర్నిచర్‌ను ధ్వంసం చేస్తూ.. అసభ్యకరమైన బూతులతో దూషించారు. ఈ ఘటనపై క్యాషియర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో మహర్షి వాల్మీకి జయంతి



నివాళులర్పించిన కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, ఉద్యోగులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్‌లో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం మహర్షి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా జ్యోతి ప్రజ్వలన చేశారు. డీఆర్‌ఓ జేఎల్‌బి. హరిప్రియ, జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి ఝాన్సీరాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పద్మజ, కలెక్టరేట్ విభాగంలోని వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: నియోజకవర్గంలో పార్టీలకతీతంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసాగుతున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎలాంటి బేషజాలకు వెళ్లకుండా అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని చిలుకానగర్ డివిజన్‌లో మంగళవారం రూ. 1.20 కోట్ల అంచనా వ్యయంతో పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నట్లు వివరించారు. ఇచ్చిన హామీల్లో భాగంగా చిలుకానగర్ ఇప్పటి వరకు దాదాపుగా 80 శాతం వరకు అభివృద్ధి పనులు పూర్తైనట్లు కార్పొరేటర్ స్పష్టం చేశారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభించినున్నట్లు చెప్పారు. వివిధ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, స్థానికులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ గీత

మల్లాపూర్: మల్లికార్జుననగర్ కాలనీలో వరద నీటి ప్రవాహానికి బాక్స్ డ్రెయిన్‌తో శాశ్వత పరిష్కారం లభించిందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున్‌నగర్ కాలనీలో రూ.60 లక్షలతో చేపట్టబోయే పనులకు కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. డీఈ రూప, ఏఈ స్రవంతి, కాలనీవాసులు పరమేష్‌రెడ్డి, మధు, రమేష్, ప్రతాప్‌రెడ్డి, అశోక్ రెడ్డి, సోమయ్య, సారంగపాని పాల్గొన్నారు.

'డీవీసీ'తో ఒప్పందం కుదుర్చుకున్న 'ఈసీఐఎల్'

కుషాయిగూడ: సెక్యూరిటీ సిస్టమ్స్, డిజిటల్ సొల్యూషన్స్ కోసం నగరంలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) కోల్‌కత్తాలోని దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (డీవీసీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పందపత్రాలను అందజేసుకున్నట్లు సంస్థ వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. భద్రతతో పాటుగా సాంకేతిక అంశాల పరిష్కారానికి ఈ ఒప్పందం దోహదపడుతుందని ఈసీఐఎల్ డైరెక్టర్ టెక్నికల్ డాక్టర్ అనేష్‌కుమార్‌శర్మ తెలిపారు. జార్ఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, ప్రాజెక్టుల నిర్మాణం వంటి పలు అంశాలను పరిగణలోకి తీసుకుని డీవీసీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇరువురి సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు. డీవీసీ చైర్మన్ ఎస్. సురేష్‌కుమార్ ఐఏఎస్, సీఎండీ నీరజ్ ఉదయ్, జనరల్ మేనేజర్ నీరజ్ జైన్, ఈసీఐఎల్ ఎస్ఎస్‌పీడీ హెడ్ శాంతయ్య పాల్గొన్నారు.



ఒప్పందపత్రాలు మార్చుకున్న ఈసీఐఎల్, డీవీసీ ప్రతినిధులు

'ఏటీసీ' సెంటర్ సందర్శన

పెండింగ్ పనులు పూర్తి చేయాలన్న కలెక్టర్



అల్వాల్ ఐటీఐ కళాశాలలో ఏటీసీ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి

అల్వాల్: అల్వాల్‌లోని ఐటీఐ కళాశాలలో నూతనంగా ప్రారంభించిన అడ్వాన్డ్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఏటీసీలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. సెంటర్‌లోని మిషనరీ, తరగతి గదులను పరిశీలించి, పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్క్‌షాప్ లీకేజీ అవుతుందని పారిశుద్ధ్య సిబ్బంది కొరత ఉందని, కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. డీవో శేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శైలజ, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

కీసర: ఆదికవి, రచయిత వాల్మీకి మహర్షి జయంతిని దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం కమిషనర్ వెంకట్‌రెడ్డి హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఈఈ బాలమురళి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వృథా

బోడుప్పల్: గాయత్రిహిల్స్ రోడ్డు నంబరు–2లో తాగునీటి పైపులైన్ పగిలిపోయి విలువైన తాగునీరు నేలపాలైంది. సుమారు 4 గంటలకు పైగా తాగునీరు రోడ్డుపై ప్రవహించింది. దీంతో ఈ పైపులైన్ ద్వారా సరఫరా అయ్యే నీరంతా రోడ్డు పాలైంది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు.

రూ.48 లక్షలతో సీసీరోడ్డు పనులు

మౌలాలి: వినాయకనగర్ డివిజన్ పరిధిలోని డీఏవీ పాఠశాల నుంచి నవభారత్ పాఠశాల వరకు రూ.48 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం పనులు ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ.. మౌలిక వసతులకు ప్రాధాన్యత నిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రేణుకానగర్‌లోని డ్రైనేజీ పనులను పరిశీలించారు. మంగేష్, ఓంప్రకాష్, డీఈ లౌఖ్య, ఏఈ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో మరమ్మతులు

మల్లాపూర్: భవానీనగర్ కాలనీ కమాన్ వద్ద బాక్స్ డ్రెయిన్ పూడికతీత తీస్తుండగా తాగునీటి పైప్‌లైన్ పగిలిపోయింది. గత వారం రోజులుగా పలు కాలనీవాసులు తాగునీరు సరఫరా కాక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్నా మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కప్పర సాయికిరణ్‌గౌడ్ సొంత డబ్బులతో పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు.

గంజాయి విక్రేత రిమాండ్

మల్లాపూర్: గంజాయి విక్రేతను నాచారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన జగన్నాథ్ జైసింగ్ (29) మల్లాపూర్ చాణక్యపురి కాలనీలో గంజాయి విక్రయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అతడిని అరెస్ట్ చేసి 100 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



అలాయ్‌బలాయ్‌లో పాల్గొన్న ఎంపీ ఈటల, నాయీ బ్రాహ్మణులు

శామీర్‌పేట్: నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం శామీర్‌పేట్‌లోని తెలంగాణ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అలాయ్ బలాయ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎంపీ ఈటల మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్లు కరెంట్ ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చి, అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. శామీర్‌పేట్‌లోని నాయీ బ్రాహ్మణ సంఘం కార్యాలయానికి ప్రహరీ, నీటి వసతికి బోర్‌వేయిస్తానన్నారు. మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, నాయీబ్రాహ్మణులు రమేష్, గోపాల్, బాలకృష్ణ, బిక్షపతి, రాకేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

మేడిపల్లి: ఉప్పల్ ఐడియల్ ఆర్గనైజేషన్ ఆఫ్ గుడ్ టిప్లర్స్ చారిటబుల్ ట్రస్ట్ (ఐఓజీటీ)ఆధ్వర్యంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మాతృ అభయ ఫౌండేషన్ (ఐఓజీటీ) సభ్యులు ట్రస్ట్‌కు రెండు క్వింటాళ్ల బియ్యం, సరిపడా నిత్యావసర వస్తువులను మాతృ అభయ ఫౌండేషన్ నిర్వాహకులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ.. సమాజాన్ని సైతం మత్తుకు దూరంగా ఉంచేలా పలు చైతన్య కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉప్పల్ ఐఓజీటీ ట్రస్ట్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి, సెక్రటరీ గోనె ప్రభాకర్‌రెడ్డి, ట్రెజరర్ సుధాకర్, మెంబర్స్ మేకల రాంచంద్రారెడ్డి, మేకల రంగారెడ్డి, నర్సింహరెడ్డి, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాలుష్య కాసారంగా తుమ్మ చెరువు!



మేడ్చల్ తుమ్మచెరువులో రంగు మారిన నీరు

మేడ్చల్: పట్టణంలోని ప్రధాన చెరువుల్లో ఒకటైన తుమ్మ చెరువు కాలుష్యకాసారంగా మారుతోంది. సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు, వ్యాపారులు ఇష్టానుసారంగా చెరువు వద్ద వ్యర్థాలను పారవేస్తుండటం, చెరువు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న కాలనీల మురుగు చెరువులో కలుస్తుండటంతో చెరువు నీరు రంగు మారుతోంది.

ఇష్టానుసారంగా వ్యర్థాల పారబోత..

ప్లాస్టిక్ కవర్లు, ఖాళీ కొబ్బరి బోండాలు, ఇళ్లల్లో ఉండే పాత వస్తువులు, మూటలు ఇతరత్రా వస్తువులను చెరువు ఒడ్డున పారబోస్తున్నారు. రోజుల తరబడి ఉండటంతో కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. చెత్తను నీటిలో వేయడంతో చెరువులు కలుషితమై కాలుష్యకాసారాలుగా మారుతున్నాయి.

రంగు మారిన నీరు..

తుమ్మ చెరువులో ఉన్న నీరు క్రమేపి పూర్తిగా రంగు మారుతోంది. నీరంతా ఆకుపచ్చ రంగులో కనిపిస్తోంది. చెత్త వేయడం, మురుగు కాలువ నీరు చెరువులోకి చేరడంతో నీరు పూర్తిగా దుర్వాసన వెదజల్లుతోంది.

కనీస విచక్షణ మరిచి..

అధికారులు వ్యర్థాలు పారవేయకుండా చుట్టూ డైమండ్ జాలీ ఏర్పాటు చేసి, పటిష్టమైన చర్యలు తీసుకున్నా.. కనీసం విచక్షణ లేకుండా కొందరు చెరువులో చెత్తను పారవేస్తున్నారని, పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మురుగు చెరువులో కలవకుండా నివారణ చర్యలు చేపట్టకపోవడంతో నీరు రంగుమారి భూగర్భ జలాలు కలుషిత మవుతున్నాయి.